ఏఐటీయూసీలో చేరిన సీఐటీయూ కార్మికులు



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)కు సంబంధించిన పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)లో చేరారు. బుధవారం స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.రామయ్య, బి.మధు యూనియన్‌లో చేరిన వారికి సభ్యత్వాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920లో ఆవిర్భవించిందని, నాటి నుండి కార్మికుల హక్కుల రక్షణకు, సంక్షేమానికి అనేక ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. ఏఐటీయూసీలో చేరిన 50 మందికి స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 10 గంటల పనివిధానం కార్మికుల అనారోగ్యాల పాలుచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు 10 గంటల పని విధానం అమలు చేసేందుకు ఆమోదం తెలపడాన్ని, పరిశ్రమల్లో రాత్రి పూట మహిళలు విధులు చేయాలన్న కొత్త నిబంధనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, నాగేంద్ర, రామయ్య, జోసెఫ్, ఓబయ్య, ప్రతాప్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల ఆవేదన



మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : తమకు ప్రోత్సాహకాలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంకా నెరవేరకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఏపీఎస్ ఆర్టీసీ హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్యదర్శి బి.వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శి ఇల్లూరు సుబ్బన్న తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న బడుగు వికాసం పథకంలో భాగంగా 2022లో ఎంఎస్ఎంఈ ద్వారా బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన ఇవ్వడం జరిగిందన్నారు. బస్సుల కొనుగోలు సమయంలో ఒక్కో బస్సుకు రూ.లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామన్నారు. బస్సులు కొనుగోలు చేసినప్పటి నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందకపోగా వచ్చిన అరకొర అద్దెలతోనే కంతులు చెల్లిస్తూ జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ బాధలను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఏడాది మే 15వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రభుత్వం ప్రకటన చేయడంతో ఎంతో ఆశగా ఎదురు చూశామన్నారు. మళ్లీ జూన్‌లో నిధులు విడుదల చేస్తామని చెప్పిన మాటలు నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాయిదాలు వేయకుండా ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను విడుదల చేసి మాలాంటి దళిత పారిశ్రామిక వేత్తలను ఆదుకోవాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఆవరణలో కడప దేవాదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రమణమ్మ సమక్షంలో లెక్కించారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి ఇప్పటి వరకు హుండీ మొత్తం ఆదాయం రూ.4,96,297 వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి యస్.రామలింగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు ఆర్టీఓ బదిలీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఆర్టీఓగా పనిచేస్తున్న పి. మురళీధర్ బదిలీ అయ్యారు. ఆయనను మచిలీపట్నానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మచిలీపట్నంలో ఆర్టీఓగా పని చేస్తున్న మనీషాను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరులోని ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీఓ మురళీధర్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కరిముల్లా, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, ఎంవీఐలు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమి స్వాధీనం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం బద్వేల్ రోడ్డులో ఉన్న స్మశాన భూమిని ఆక్రమణ దారుల నుంచి బుధవారం రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కందిమల్లాయ్యపల్లె ప్రజలకోసం అప్పటి ప్రభుత్వం స్మశానం కోసం సోమిరెడ్డిపల్లె పొలం సర్వే నంబర్ 464లో 10.70 ఎకరాలు కేటాయించారు. అయితే 20 ఏళ్ల క్రితం చౌదరవారిపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ఆరు ఎకరాలు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారు. స్మశానం భూమిని ఆక్రమించుకున్నవారిపై కలెక్టర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన అధికారులు ఆరు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

బద్వేలు అర్బన్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తాను పని చేస్తున్న ప్రాంతంలోనే అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఉపాధ్యాయ సంఘం నాయకులు రవిశంకర్, వెంకట్ పేర్కొన్నారు. బద్వేలు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవోగా పని చేస్తూ బదిలీ కడప డీటీవో ఆఫీసుకు వెళ్లిన వెంకట సుబ్బయ్యను బుధవారం కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు ఉపఖజానా కార్యాలయంలో 7 సంవత్సరాలకు పైగా ఎంతో నిజాయితీ, నిబద్ధతతో వెంకట సుబ్బయ్య విధులు నిర్వహించారని ఆయన సేవలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు మరచిపోలేవని కొనియాడారు.

మెరుగైన సేవలు అందించాలి

బద్వేలు : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సూచించారు. మంగళవారం రాత్రి బద్వేలు పట్టణంలోని గాంధీనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఓ వినియోగదారుడు లైన్‌మెన్‌కు ఫోన్ చేశారు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బద్వేలు సబ్‌స్టేషన్ విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఫోన్ చేశారు.అక్కడి నుంచి స్పందన లేదు. అనంతరం సదరు వ్యక్తి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు ఫోన్ చేసి విద్యుత్ అంతరాయం, సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే అధికారి స్థానిక అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఫోన్ చేసి వినియోగదారులు సమస్యలను దృష్టికి తెస్తే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించినట్లు సమాచారం.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని మైనారిటీ నాయకుడు ఎస్.షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మోడంపల్లె, కొత్తపల్లెలోని పలు సర్వే నంబర్లలోని వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆక్రమణకు గురైన వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని, సర్వే చేసి వక్ఫ్ భూములకు హద్దులు నిర్ణయించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రహరీలు నిర్మించాలని కోరారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని, వచ్చే నాలుగేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, హౌసింగ్ తదితర విభాగాలకు సంబంధించి చేపట్టిన పనులను వివరించాలని అధికారులకు సూచించారు. ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేసి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి గత ఏడాదిలో 61 పనులు మంజూరు చేయగా 54 పనులను పూర్తి చేశామన్నారు. 2029 నాటికి రూ.70 కోట్ల అంచనాలతో 78 పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాసులు, తహసీల్దార్ గంగయ్య పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

మైదుకూరు : జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యదర్శి వర్గ సభ్యుడు, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మైదుకూరులో నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు కడప జిల్లాపై సవితి తల్లి ప్రేమను చూపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారు కానీ ప్రజల అవసరాలను తీర్చే నాయకుడు లేడని విమర్శించారు. పథకాల పేరుతో పేదలకు ఆశ చూపించి సర్వనాశనం చేస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే కాలం అతి త్వరలో ఉందని హెచ్చరించారు. మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, మైదుకూరు ఏరియా సహాయ కార్యదర్శి ఏవీ శివరామ్, బి.మఠం మండల కార్యదర్శి హృదయనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు బీవీ శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు షావల్లి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులతో బ్రిడ్జి నిర్మాణం



చౌదరవారిపల్లె దగ్గర బ్రిడ్జి నిర్మాణంలో పగిలిన పైపులను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరవారిపల్లె - పలుగురాళ్లపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డులో చౌదరవారిపల్లె దగ్గర ఉన్న బ్రిడ్జి కూలిపోయింది. రాకపోకలకు అంతరాయం కలగడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 5లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల ద్వారా కంట్రాక్టర్ స్థానిక టీడీపీ నాయకుడు పనులు చేపట్టాడు. పగిలిన పైపులు అమర్చి బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ 5లక్షలు నిధులకు కొత్త పైపులు ఏర్పాటు చేయాల్సింది పోయి పాత పైపులను ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

మైదుకూరు : భూసార పరీక్షలతో వ్యవసాయంలో లాభాలు సాధించవచ్చని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాగవత ప్రియ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా బుధవారం పెద్దముడియం మండలంలో కార్యక్రమాలను నిర్వహించారు. మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అధ్యక్షతన పెద్దపసుపుల, కొట్టాలపల్లె, ఉలవపల్లె, పాలూరు, పెద్దముడియం, చిన్నపసుపుల, బోడితిప్పనపాడు, వెంకటాపురం, గుండ్లకుంట గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాగవతప్రియ మాట్లాడుతూ పంటల సాగులో భూ సార పరీక్షలు ముఖ్యమైనవని తెలిపారు. భూమి రకాలను, వాటి సారాన్ని భూసార పరీక్షల ద్వారా తెలుసుకుని అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు.





ఉత్తమ విద్య.. సకల సౌకర్యాలు

- మెట్రో నగరాలకు దీటుగా విద్యాబోధన
- మంచి మార్కులు, ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులు



పాఠశాలలో చిన్నారులు



ప్రొద్దుటూరు వ్యూ

ప్రొద్దుటూరు కల్చరల్ : బంగారు వ్యాపారంలో రెండవ ముంబాయిగా పేరు గాంచిన ప్రొద్దుటూరు పట్టణంతోపాటు బద్వేలు, మైదుకూరులోని పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నాయి. ప్లే స్కూల్ మొదలు హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యను పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందిస్తున్నారు. సులభంగా విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు అవకాశం కలుగుతోంది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారు. పాఠశాల, కళాశాల యాజమాన్యాలు విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నిరంతరం పర్యవేక్షిస్తుండటంతో విద్యార్థులు చదువు, క్రీడలు, విజ్ఞానం వంటి అన్ని అంశాల్లో ముందున్నారు. దీనికి నిదర్శనం ప్రొద్దుటూరు పరిధిలో నాలుగు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా రావడం విశేషం.

బంగారు భవిష్యత్తుకు బాటలు

మూడు నియోజకవర్గాల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రంతోపాటు, దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పలు ప్రైవేటు కోచింగ్ సెంటర్ విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూల్, పాలిటెక్నిక్ ప్రవేశాలకు, జేఈఈ, నీట్, డీఎస్సీ ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్ అవార్డులను పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు అందుకుని తమ సత్తా చాటారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించడం విశేషం. విద్యార్థులకు అవసరమైన హాస్టల్ వసతి పాఠశాలల, కళాశాలల వారు కల్పిస్తున్నారు. కొంత మంది విద్యార్థులు ప్రైవేటు హాస్టళ్లలో ఉండి విద్యను అభ్యసిస్తున్నారు. వేసవి సెలవులు అనంతరం గురువారం పలు పాఠశాలలు తెరచుకోనున్నాయి. విద్యాసంస్థలు విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి.

ఏపీ ఈఏపీసెట్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇటీవల విడుదలైన ఏపీ ఈఏపీసెట్‌లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కె.సునీల్ బాబు, కె.సృజన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో బాచుపల్లి వీర అభిజ్ఞాన్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో 1,062వ ర్యాంక్, ఎస్.నవ్యశ్రీ 9,034, డి.దేవేశ్వర్ 21,090, ఎం.వంశీరెడ్డి 27,447, యల్లంపల్లి మన్సూర్ 27,511, జి.సమీరబాను 34,484, జి.నాగచందన 44,583 ర్యాంకులు సాధించారని తెలిపారు. షార్ట్ టర్మ్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 92 శాతం మంది ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో అర్హత సాధించారని తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

బద్వేలు అర్బన్ : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని నాగభూషణం విద్యా సంస్థల పరిపాలనాధికారి రాచపూడి వెంకటసాయి కృష్ణ తెలిపారు. బద్వేలు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్వర్గీయ రాచపూడి నాగభూషణం స్థాపించిన పలు విద్యాసంస్థలు బద్వేలుకే తలమానికంగా నిలుస్తున్నాయి. 1997లో స్థాపించిన పలు విద్యాసంస్థల్లో విద్యార్థుల ఉన్నతికి, నైతిక విలువలను పెంపొందించేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీ.జీ. కళాశాలకు అటానమస్ హోదా కూడా లభించింది. దీంతో నియోజకవర్గంలోనే అటానమస్ హోదా సాధించిన ఏకైక కళాశాలగా నిలిచింది. అంతేకాకుండా ఎన్సీసీ విభాగాలైన ఆర్మీ, నేవి, ఎయిర్‌ఫోర్స్ మూడు విభాగాలు గల రాష్ట్రంలోనే ఏకైక కళాశాలగా కూడా రాచపూడి నాగభూషణం కళాశాల నిలిచిందని రాచపూడి వెంకటసాయి కృష్ణ తెలిపారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మాస్టర్స్ జూనియర్ కాలేజీ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. ఇటీవల కడపలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఎల్.సాయిశ్రీ రక్షిత 980/1000, ఎ.చైతన్య 947/1000 మార్కులు సాధించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు, రూ.20వేలు నగదు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అవార్డులు అందుకున్న వీరిని కళాశాల ప్రిన్సిపాల్ మునిభాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు కె.సంజీవరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, మునిశ్రీనివాసుల రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



















